క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ కోఆప్షన్ సభ్యుడు అమీరుల్లాఖాన్ మృతి


అమీరుల్లాఖాన్

మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నాయకులు పఠాన్ అమీరుల్లాఖాన్(60) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయన గతంలో కౌన్సిలర్‌గా కూడా పనిచేశారు. గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన మృతికి మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు సంతాపం తెలియజేశారు.


నివాళులర్పిస్తున్న అన్నా రాంబాబు

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మార్కాపురం: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుర్రపుశాల చంద్రశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. అ. ధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి 15 నెలలైనా ఒక్క డీఏ కూడా ఇవ్వకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ×కేంద్ర ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు ఒకసారి తమ ఉద్యోగులకు డీఏలు ఇస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఇవ్వకపోవడం శోచనీయం. అధికారంలోకి రాగానే పీఆర్సీ కమిషన్‌ను నియమిస్తామని, ఐఆర్ ఇస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వెంటనే ఐఆర్‌ను ప్రకటించి, పీఆర్సీ కమిషన్‌ను నియమించాలి. పాఠశాలల్లో విద్యార్థుల రోల్‌ను బట్టి ఉపాధ్యాయులను నియమించాలి. ఏకోపాధ్యాయ పాఠశాలలు లేకుండా చూడాలి౯ అని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఆత్మగౌరవం కోసం కేవీపీఎస్ పోరాటం


కేవీపీఎస్ జెండా ఆవిష్కరిస్తున్న కేవీపీఎస్ నాయకులు

మార్కాపురం: ఆత్మగౌరవం, సమానత్వం, కుల వివక్ష నిర్మూలనపై కేవీపీఎస్ పోరాటం చేస్తోందని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు జవ్వాజి రాజు పేర్కొన్నారు. కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని బాపూజీకాలనీ, భగత్ సింగ్ కాలనీ, యానాదుల కాలనీల్లో కేవీపీఎస్స్ జెండాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అయినా ఇప్పటికీ దళితులకు శ్మశానవాటికలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దళిత మహిళలు పనిచేసే చోట అవమానాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రఫీ, కేవీపీఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాచర్ల: ఆర్‌డీఎస్ఎస్ పనుల నేపథ్యంలో ఆకవీడు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ డీఈ బీవై శేషగిరిరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆకవీడు, ఆరవీటికోట, కొత్తూరు, అచ్చంపేట, చోళ్లవీడు గ్రామాల్లో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి, విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.


ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

ఉపాధి హామీ కూలీల వివరాలు	
మండలం	యాక్టివ్ కూలీల సంఖ్య
అర్ధవీడు	17,031
బేస్తవారిపేట	21,124
కంభం	11,511
గిద్దలూరు	20,111
కొమరోలు	12,868
రాచర్ల	12,059
మార్కాపురం	24,481
తర్లుపాడు	16,367
పొదిలి	12,288
కొనకనమిట్ల	27,481

ఉపాధి హామీలో అక్రమాల కట్టడికి ఈ-కేవైసీ

- మొబైల్ మానిటరింగ్ సిస్టం యాప్‌లో వివరాలు నమోదు
- ఈ-కేవైసీ చేయించుకోని కూలీలకు పని కల్పించే అవకాశం లేదు
- ఆధార్, జాబ్‌కార్డుతో ఉపాధి హామీ సిబ్బందిని సంప్రదించాలి

బేస్తవారిపేట:

ఉపాధి హామీ పథకం కూలీలు తప్పనిసరిగా ఈ-కేవైసీ నమోదు చేయించుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కూలీలు తమ ఆధార్ కార్డును జాబ్‌కార్డుతో అనుసంధానం చేసుకుంటేనే ఉపాధి హామీ పని కల్పించాలని నిర్ణయించింది. ఈ-కేవైసీ నమోదు ప్రక్రియ కోసం ఎంజీఎన్ఆర్‌ఈజీఎస్ మొబైల్ మానిటరింగ్ సిస్టం యాప్‌ను కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టింది. ఉపాధి కూలీల ఆధార్, ఉపాధి వివరాలు నమోదు చేసి ముఖ గుర్తింపు ఫొటో యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఇందుకుగాను కూలీలు తమ ఆధార్, జాబ్‌కార్డులతో స్వగ్రామంలోని ఉపాధి హామీ సిబ్బందిని సంప్రదిస్తే ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తి చేస్తారు. అయితే ఆధార్ కార్డును కూలీలు తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకుని ఉండాలి. ఈ-కేవైసీ ప్రక్రియ చేయించుకోని కూలీలకు ఇకపై పని కల్పించడం వీలుపడదని ప్రభుత్వం స్పష్టం చేసింది.


ఈ-కేవైసీపై అవగాహన కల్పిస్తున్న ఏపీడీ(ఫైల్)

పనుల్లో పారదర్శకత కోసమే..

ఉపాధి హామీ పథకం పనుల్లో పారదర్శకత కొరవడిందన్న ఆరోపణలు, నిధులు దుర్వినియోగం చేస్తున్నట్లు తరచూ సోషల్ ఆడిట్‌లో వెల్లడవుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. క్షేత్ర స్థాయిలో జరిగే అవినీతికి చెక్ పెట్టేందుకు సాంకేతికతను వినియోగించాలని నిర్ణయించింది. కొత్తగా కేంద్రం తీసుకున్న ఈ-కేవైసీ విధానంతో పనుల్లో పారదర్శకత పెరుగుతుందని, ఒక జాబ్‌కార్డుపై మరొకరు పనిచేసే అవకాశం ఉండదని అధికారులు పేర్కొంటున్నారు.

> **ఈకేవైసీ చేయించుకోవాలి**
> ఉపాధి హామీ పథకం కూలీలు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలి. నమోదు ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించాం. జాబ్‌కార్డుతో ఆధార్ అనుసంధానం చేసే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఎన్ఆర్‌ఈజీఎస్ సిబ్బందికి ఆదేశాలిచ్చాం. కూలీలు ఆధార్ వివరాలను వీలైనంత త్వరగా అప్‌డేట్ చేసుకోవాలి. త్వరలో ఈ-కేవైసీ పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.
> – ఎస్.భాస్కర్‌రావు, డ్వామా ఏపీడీ

మున్సిపల్ వాటర్ ట్యాంకర్‌కు పసుపు రంగు

మార్కాపురం టౌన్: టీడీపీ నేతల ప్రచార యావ హద్దులు మీరుతోంది. మార్కాపురం పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఏమాత్రం శ్రద్ధ చూపని కూటమి నేతలు.. సొంత డబ్బా కొట్టుకోవడానికి తహతహలాడుతున్న తీరు చూసి జనం చీదరించుకున్నారు. ఇటీవల మున్సిపల్ వాటర్ ట్యాంకర్‌కు పసుపు రంగు వేశారు. వాస్తవానికి ఈ ట్యాంకర్‌ను సుమారు రూ.5 లక్షల నిధులు వెచ్చించి ఎంపీ వైవీ సుబ్బారెడ్డి గతంలో మున్సిపాలిటీకి కేటాయించారు. అయితే మరమ్మతుల పేరుతో ట్యాంకర్ అసలు రంగును తొలగించి పసుపురంగు వేయించారు.


పసుపు రంగులో మున్సిపల్ వాటర్ ట్యాంకర్

అమ్మవారి కలశం రూ.65 వేలు


వేలంలో దక్కించుకున్న అమ్మవారి కలశంతో కమిటీ సభ్యులు

బేస్తవారిపేట: దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి వద్ద ఉంచిన కలశానికి ఆదివారం వేలం నిర్వహించారు. వాగిచర్ల యల్లారావు అనే వ్యక్తి రూ.65 వేలకు కలశాన్ని దక్కించుకున్నారు. అమ్మవారి ఉత్సవ విగ్రహానికి వెండి మకర తోరణాన్ని విశ్వనాథుల అశోక్‌కుమార్ రూ.5.40 లక్షలు, వెండి త్రిశూలాన్ని విశ్వనాథుని రామచంద్రుడు రూ.2.20 లక్షలతో చేయించేందుకు వేలం పాడారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత ధర్మకర్త బొంతల లక్ష్మణస్వామిగుప్తా, ఆలయ కమిటీ అధ్యక్షుడు వాగిచర్ల మారుతిప్రసాద్, కమిటీ సభ్యులు చాటకొండ సత్యనారాయణ, కందూరి సుభాష్, చక్కా కృష్ణ, యువజన విభాగం అధ్యక్షుడు మిచ్చిన గట్ల రమేష్, క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు శేగు ప్రసాద్ పాల్గొన్నారు.

వైభవంగా కనకదుర్గమ్మ గ్రామోత్సవం

కొనకనమిట్ల: దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా మండలంలోని గొట్లగట్టులో కనకదుర్గమ్మ విగ్రహం పెట్టి 12 రోజులపాటు విశేష పూజలు నిర్వహించారు. వేడుకల ముగింపు సందర్భంగా శనివారం రాత్రి కనకదుర్గమ్మ గ్రామోత్సవం వైభవంగా సాగింది. మహిళల కోలాటం ఆహూతులను అలరించింది. మహిళా భక్తులకు కమిటీ నిర్వాహకుడు రావులపల్లి నరసయ్య ఆధ్వర్యంలో అమ్మవారి పసుపు, కుంకుమ, గాజులు ఇచ్చి సత్కరించారు.


ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ అమ్మవారు

ఉత్సాహంగా కోలాట మహోత్సవం

గిద్దలూరు రూరల్: దేవీ శరన్నవరాత్రి వేడుకల ముగింపు సందర్భంగా పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని శేషపాన్పుపై ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై సామూహిక కోలాటం ప్రదర్శిస్తూ కుసుమ హరనాథస్వామి ఆలయం వరకు వెళ్లారు. భక్తులకు అన్న సంతర్పణ చేశారు.


వాసవీమాతను దర్శించుకుంటున్న భక్తులు

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

అల్లూరి పోలేరమ్మ తల్లికి పూజలు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మకు భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ అర్చకులు అమ్మవారి మూలవిగ్రహమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు చేశారు. ఆలయ ఆవరణలోని నాగశిలలు, పుట్టకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఈఓ చెన్నకేశవరెడ్డి, ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గ్రామ దేవతలకు బోనాలు


తర్లుపాడులో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

తర్లుపాడు: స్థానిక బీసీ కాలనీ మహిళలు ఆదివారం గ్రామ దేవతలైన అంకాలమ్మ, పోలేరమ్మ తల్లులకు బోనాలు సమర్పించారు. కుంకుమ బండి కట్టి బీసీ కాలనీ నుంచి సంబరం చేసుకుంటూ గుడి వద్దకు చేరుకున్నారు. సకాలంలో వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. తర్లుపాడుతోపాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో 'అన్నా'


ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

కొమరోలు: మండలంలోని సర్విరెడ్డిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన అంకాలమ్మ, పోలేరమ్మ, శీతలమ్మ, నాభిశిల, గమిడి రాయి, ఆంజనేయస్వామి నూతన విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గ్రామస్తులు అన్నా రాంబాబుకు ఘన స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల అనంతరం సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు, ఎంపీటీసీ షేక్ సుబానీ, వైఎస్సార్ సీపీ నాయకులు చదుళ్ల రమణరెడ్డి, వెంగయ్యచౌదరి తదితరులు పాల్గొన్నారు.

హిందువులు ఐకమత్యంతో ఉండాలి


మాట్లాడుతున్న శివకుమార్

గిద్దలూరు రూరల్: దేశం కోసం ధర్మం కోసం హిందువులు ఐకమత్యంతో ఉండాలని ఆర్ఎస్ఎస్ విభాగ్ పర్యావరణ ప్రముఖ్ శివకుమార్ పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని విశ్వభారతి స్కూల్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరిలో దేశభక్తిని పెంపొందించేందుకు ఆర్ఎస్ఎస్ కృషి చేస్తోందన్నారు. అనంతరం ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయుధ పూజ, ధ్వజ ప్రణామాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నాయకులు రామకృష్ణ, మల్లారెడ్డి, శివశంకర్‌రెడ్డి, పిడతల రమేష్‌రెడ్డి, డాక్టర్ జేవీ నారాయణ, ఎం.కృష్ణకిశోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొదిలి: ఆర్ఎస్ఎస్ శత జయంతి ఉత్సవాలు ఆదివారం స్థానిక సరస్వతీ విద్యా మందిర్‌లో నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ, ఆర్ఎస్ఎస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో దేశానికి సంఘ్ చేస్తున్న సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో విభాగ కార్యాకారిణి సభ్యులు కొండా మల్లికార్జునరెడ్డి, మాగులూరి రామయ్య, నాగరాజారావు, వెంకటరామిరెడ్డి, యక్కల శేషగిరి, రమణ కిషోర్, కన్నెదారి శేషయ్య, మువ్వల పార్థసారథి, బెల్లంకొండ విజయలక్ష్మి, వెన్నెల చేతనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోతుల దాడిలో మహిళకు గాయాలు


కోతుల దాడిలో గాయపడిన వీరమ్మ

గిద్దలూరు రూరల్: కోతుల దాడిలో మహిళకు గాయాలైన సంఘటన మండలంలోని ముండ్లపాడు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. పెద్ద సంఖ్యలో కోతుల సమూహం గ్రామంలోకి ప్రవేశించి ఇంటి వద్ద ఉన్న అంబటి వీరమ్మ అనే మహిళపై దాడికి పాల్పడ్డాయి. దీంతో ఆమెకు మోకాలి వద్ద బలమైన గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇదిలా ఉండగా గత నెల 27వ తేదీన గ్రామంలో షేక్ సైదమ్మ, ఆకుల రమణమ్మ అనే ఇద్దరిపై కోతులు దాడి చేయడంతో కాళ్లు, చేతులపై తీవ్రగాయాలయ్యాయి. కోతులను కట్టడి చేసి రక్షణ కల్పించాలని పంచాయతీ సిబ్బందికి మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కోతుల బెడద నుంచి రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వన్యప్రాణులను వేటాడటం నేరం


బొమ్మలింగంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

అర్ధవీడు: వన్యప్రాణులను వేటాడటం చట్టరీత్యా నేరమని ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి ప్రసాదరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కాకర్ల, యాచవరం, బొమ్మలింగం గ్రామాల్లో ఆదివారం వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలు నిర్వహించారు. డీఆర్ఓ మాట్లాడుతూ.. చెట్లు, వన్యపాణులను కాపాడటం వల్ల అడవులు ఏపుగా పెరిగి సకాలంలో వర్షాలు కురుస్తాయన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీట్ అధికారులు ఏడుకొండలు, ధనలక్ష్మి, సుబ్బారెడ్డి, స్నేక్ క్యాచర్ నిరంజన్, గ్రామ ప్రజలు ఏరువ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పోలేరమ్మా.. దీవించమ్మా..


వింజవర్తిపాడులో నైవేద్యాలతో భక్తులు

కొనకనమిట్ల: మండలంలోని వింజవర్తిపాడు, మద్రిపాలెం బీసీ కాలనీలో ఆదివారం గ్రామ దేవతలైన పోలేరమ్మతల్లికి ఉత్సవం నిర్వహించి పొంగళ్లు పెట్టారు. మహిళలు బోనాలతో వెళ్లి అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్లు సమర్పించి మొక్కులు చెల్లించారు. సకాలంలో వర్షాలు కురిసి గ్రామాలు పాడిపంటలతో పచ్చగా ఉండాలని పూజలు చేశారు. మద్రిపాలెం బీసీ కాలనీలో కుంకుమ బండ్ల ఉత్సవం వైభవంగా సాగింది.

ఉత్సాహంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం


నాగులవరం జెడ్పీ హైస్కూల్లో పూర్వ విద్యార్థులు


బేస్తవారిపేట : గురువులతో సిద్దార్థ స్కూల్ పూర్వ విద్యార్థులు

బేస్తవారిపేట: స్థానిక సిద్దార్థ ఉన్నత పాఠశాలలో 2004లో పదో తరగతి చదువుకున్న వారు ఆదివారం అదే పాఠశాల వేదికగా సందడి చేశారు. 21 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్న మిత్రులు ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. చిన్ననాటి సంగతులు నెమరు వేసుకున్నారు. ఆటపాటలతో ఆనందంగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేశారు. తమకు విద్య నేర్పిన గురువులు విజయభాస్కర్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, కృష్ణ, సుబ్రహ్మణ్యం, గఫూర్, నారాయణరెడ్డి, ప్రభాకర్‌రెడ్డిని శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు మద్దుల విజయ్‌కుమార్‌రెడ్డి, కె.అశోక్‌కుమార్, ఓ.రవికుమార్, పి.వెంకటేశ్వరరెడ్డి, కె.సుబ్బారావు, ప్రియాంక, శివపార్వతి నేతృత్వం వహించారు.

అర్ధవీడు: మూడు దశాబ్దాల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. తరగతి గదుల్లో చిలిపి చేష్టలను గుర్తు చేసుకున్నారు. ఈ అపూర్వ కలయికకు అర్ధవీడు మండలంలోని నాగులవరం జెడ్పీ హైస్కూలు వేదికగా మారింది. హైస్కూల్లో 1993–94, 1994–95లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం నాడు కలుసుకున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్న పూర్వ విద్యార్థులంతా హాజరై సందడి చేశారు. నాటి హెచ్‌ఎం గాదం పుల్లారెడ్డి, ఉపాధ్యాయులు పిచ్చిరెడ్డి, రాజేశ్వరి, మేరిజాను, తిరుపతిరెడ్డి, ఐ.తిరుపతయ్యను ఘనంగా సన్మానించారు.